కథ

# బామ్మా కలాపం

కామరాజుకు అవి పన్నెండోసారి పెళ్ళిచూపులు!

ఇల్లేం ఆర్భాటంగా కనబడ్డంలేదుగానీ కించిత్తు విచారంగానే ఉంది. కారణాలేంటని అడిగితే- జరిగిన పది పెళ్ళిచూపుల్లోను పిల్ల మనోడిని నచ్చి చావలేదు. సామాన్యుడా మన కామరాజు పదకొండోసారి పిల్ల తనను నచ్చినా ఆయన నచ్చలేదని ఖరాకండిగా కక్కేశాడు.

ఇక్కడో ముఖ్య విషయమేంటంటే పిల్ల బాగానే ఉన్నా, 'ఒక్కసారైనా నేను ముఖం తిప్పకపోతే మన ప్రెస్టేజేం కాను' అనుకుని పాపం! ఆ రకంగా పన్నెండో విడత పెళ్ళిచూపులకి ప్రమోట్ అయ్యాడు.

కామరాజని ఆ పేరు ఎందుకు పెట్టింటో బామ్మ? ఆ పేరు చెప్పగానే పిల్ల జడుసుకుంటోంది. ఏ పెళ్ళిచూపులైనా కాబోయే పెళ్ళికొడుక్కి, పెళ్ళికూతురికి అవుతాయిగానీ మన కా.రా. (అపార్థం చేసుకోకండి కామరాజే)కు మాత్రం వాళ్ళ బామ్మ బంగారమ్మకు పెళ్ళికూతురికి జరుగుతున్నాయి. అదేంటని అడిగితే మీరడగవచ్చు కానీ కా.రా. అడగలేడే- వాళ్ళ నాన్నేమో అమ్మ కొడుకు. కారానేమో నాన్న కొడుకు. ఇదన్నమాట సంగతి.

బామ్మకు కామరాజంటే దారుణమైన ప్రేమ! చిన్నప్పటి నుండి బామ్మనీడలో పెరిగి ఇప్పుడు దూరంగా పోతానంటే ముసల్ది ఓ పట్టాన వదలడం లేదు.

ఏళ్ళు పాతిక దాటిపోతున్నాయి. అందులో ఐదో వంతు వయసు పిల్లాడిలా చూస్తుంది. చెప్పకుండా సినిమాకు కూడా వెళ్ళనీదు. ఆఖరికి.. ఇక చెప్పకూడదు మన కారా పాపం ఫీలయిపోతాడు.

''వెర్రి బాగులోడు. అంతా తాత పోలికే'' ఇది బంగారమ్మ రొటీన్ డైలాగ్. ఎక్కడ అనకూడదని కోరుకుంటాడో అక్కడే పేల్చుతుంది.

ఏడో విడత పెళ్ళి చూపులకనుకుంటా..పిల్ల మన కారా 'నచ్చాడ'ని చెప్పడానికి తల ఊపేంతలో ''మా సన్నాసి ఒట్టి పిరికిగొడ్డు. బల్లి మీద పడితే జడుసుకుని వారందాకా మంచం దిగలేదు'' అంది.

'అదంతవసరమా' అన్నట్లు చూశాడు. పిల్ల తలని నిలువునా ఊపుతాననుకుంది మొదట. అరక్షణంలో తేడా వచ్చేసింది. అడ్డంగా ఊపింది. ఊపడమే కాదు- ఎంత మాటంది కామరాజును. చెప్పకూడదని చెప్పడం లేదు గానీ 'చవట' అంది ఒక్క కారాకే వినబడేట్లు. కళ్ళు రెండే ఇచ్చి దేవుడు అన్యాయం చేశాడు. ఎన్ని కన్నీళ్ళు ఉబికి వచ్చాయో కామరాజుకు పాపం! ఏడుద్దామంటే కళ్ళు అందరికీ కనబడేటట్లు ఎదురుగానే ఉన్నాయని ఏడవలేదు. ఇంటికొచ్చాక ఏడిస్తే బామ్మ కంట్లో పడితే ఈ విషయం మరెక్కడైనా చెప్పిచస్తుందని ఆపుకున్నాడు.

మరి ఇపుడేమో ఇల్లంతా కలియ తిరుగుతున్నాడు. బాత్‌రూంలో ఏదో మరిచిపోయినట్లు మాటి మాటికి వెళ్ళి వస్తున్నాడు. గోళ్ళు కొరికి కొరికి చివరికి వేళ్ళు కూడా కొరుక్కుంటున్నాడు.

బామ్మ అనుకుంది. 'సన్నాసికి ఇంత ఎక్స్‌పీరియన్స్ వచ్చినా ఎందుకో ఇంకా ఈ టెన్షను..' అని.

''అవునటే బామ్మా! నువ్వు ఎలాగూ ఎండకు తట్టుకోలేవు. ఎందుకే నువ్వు రావడం. పాపం! నీ ఆరోగ్యం బాగుండాలికదే!'' అన్నాడు కామరాజు. ఉద్దేశ్యం వేరే ఉందని మనకు తెలుస్తోంది కదా!

''అలాగంటే ఎలారా? నీ పెళ్లాం ఎలా ఉండాలో నిర్ణయించాలి కదరా! ఎర్రగా బుర్రగా ఉండగానే సరిపోతుందా? ఆడాళ్ళ సంగతి ఆడాళ్ళకు తెల్సు. సరేలేగానీ..నీకెంత ప్రేమడా నేనంటే..మీ తాతయ్య కూడా..'' అంటూ ఫ్లాష్ బ్యాక్ ఫ్రంట్‌కు తెచ్చింది.

కామరాజు గొంతుకు పచ్చిగుమ్మడికాయ అడ్డమొచ్చింది. కాకరకాయ పంటికింద పడ్డది. కళ్ళలో పచ్చిమిరపకాయలు పడే టైంకి వరండాలోకి వచ్చి నిలబడ్డాడు పాపం!

'ఛీ! ఎదవ బతుకు. ఏ సరదా లేదు. సర్కిలూ లేదు. పెళ్ళిచూపులకి ఈ ముసల్దెందుకు? ప్రతిసారీ ఏదో ఒక బాంబ్ పేల్చి ఏడిపిస్తోంది. వద్దంటే నాన్నూరుకోడు. అమ్మ నాకంటే వెర్రిది' అనుకుంటున్నాడు.

ఇంకా మిగిలిన కోపాన్ని భరించలేక గోడని తన్నబోయేడు. 'అమ్మో! తాకేది నాకే!' అనుకుని, 'అయినా నాన్నకుండాలి బుద్ధి. ఇంకా ఆ పాత చింతకాయ పచ్చడికి వంత పాడుతూ ఉంటున్నాడు. కాలం మారింది. రోజులు మారాయి. నా తలరాతే మారడం లేదు' అనుకుంటున్న మన కామరాజు ఒక్కగానొక్క గుండె పొగలు గక్కుతున్న రైలింజనులా బుస బుస మంటోంది.

''కాముడూ..దేవుడికి దణ్ణం పెట్టుకోరా..'' అంటూ బామ్మ ఉచిత సలహా ఇచ్చింది. 'ఆ పేరు చూడు ఈ కాలం కుర్రాళ్ళకి పెట్టే పేరేనా ఇది. 'కా' బదులు 'రా' ఉన్నా బావుండును. డీసెంటుగానైనా ఉండేది. ఎంత తాతయ్య పేరైతే మాత్రం ఇలా 'కసి' తీర్చుకోవడమేనా?' అనుకుంటూ వెళ్లాడు.

వెళ్ళినవాడు ఏ దేవుడికి దణ్ణం పెట్టుకోవాలో అర్థంకాక అలానే నిలబడ్డాడు. గది నిండా పటాలే మరి! ఒక్కరివి కూడా కాదు. ఎ టు జడ్ అందరు దేవుళ్ళని గదిలో బంధించేశారు. గత ఫెయిల్యూర్స్‌కి కారణమైన దేవుళ్ళని వేరు చేసి 'లేటెస్టు గాడ్స్'ని సెలెక్ట్ చేయాలిగా. అందుకని చివరికో నిర్ణయానికి వచ్చి ఒకరికి మొక్కి బయటికి వచ్చేశాడు.

''ఎవరికి మొక్కావురా..చాలాసేపలానే ఉండిపోయావ్ దేవుడంటే నీకెంత భక్తిరా..మీ తాతయ్యకు కూడా..'' సేమ్ క్యాసెట్.

అది భరించలేక ''ఆంజనేయుడికి'' అన్నాడు.

క్యాసెట్ ఆగిపోయింది. ''అదేంట్రా..బ్రహ్మచారి ఎక్కడైనా పెళ్ళిళ్ళు జరిపిస్తాడటరా? ఏ వెంకటేశ్వర స్వామికో, శివునికో మొక్కుకోవాలి గానీ..'' నోటిపై వేళ్ళేసుకుని అంటోంది.

''బామ్మా..వాళ్ళంతా పాతవాళ్ళే! వాళ్ళతో పని కాదని ఈ కొత్త దేవుణ్ణే పట్టుకున్నా'' కాస్త గట్టిగా అన్నాడు.

''ఏం మొక్కడమో'' అంటూ దీర్ఘాలు ఆపకుండా తీస్తోంది.




కామరాజు పంటి క్రింద గులకరాళ్ళు పడ్డట్లు చప్పుడు మొదలైంది.

★ ★ ★

''అమ్మాయీ..పేరేంటి?'' మొదటి ప్రశ్న.

''శశిరేఖ'' అంది పెళ్ళికూతురు పొదుపుగా.

''అంటే వెన్నెల వెలుతురన్నమాట. ఒరేయ్ కాముడూ..నీ పేరుకు భలే జోడిరా'' అంది బోసి నోటితో నవ్వుతూ.

''ఛ..'రాజు' అని ముద్దుగా పిలవచ్చు కదా!'' వినబడకుండా అని ముఖం నవ్వుతున్నట్లు సాగదీశాడు. రకరకాల టెస్టు, వన్‌డేలు ఆడించింది. కాపురం చేసేవాడిక్కూడా అవసరం లేనివి అడిగి తెలుసుకుంది.

కొన్ని చెప్పేటప్పుడు పాపం పిల్ల! సిగ్గుతో చచ్చి బ్రతికింది. ఇక అన్నీ పూర్తయ్యాక మురిపెంగా మనవణ్ని చూస్తూ ''అమ్మాయ్ నచ్చిందిరా..కాముడూ!'' అంది తనే చేసుకోబోతున్నట్లు.

నిజంగానే అమ్మాయి నచ్చింది కామరాజుకు. కానీ ఒకటే దిగులు. లోలోన గుబులు. చూస్తే మంచి తెలివైనదిగా కనబడుతోంది. తనను మెచ్చుతుందో లేదోనని.

తలెత్తి చూడలేదని చెప్పలేడు కానీ..చూసింది. ఒక్క చూపుతో అంతా పసికట్టి రాబట్టే రకం చూపది.

సుగంధ శ్రీనివాస్

''పెళ్ళికొడుకు ఏం మాట్లాడడా?'' అంది ఓ పిల్లకుంక..శశిరేఖ స్నేహితురాలేమో. గొంతు పూడుకొనిపోయింది. నాలుక పిడుచ చుట్టుకు పోయింది. వెర్రిగా ఒక్క నవ్వు నవ్వి ఊరుకున్నాడు కామరాజు.

'బామ్మే కడిగేసింది, ఆరేసింది. ఇంకేం మిగిలింది ఇస్త్రీ చేయడం తప్ప. మరది తనకు రాదే!' అనుకున్నాడు కామరాజు.

ఇంట్లో ఒక్కగానొక్క సంతానం. ఎవరింటికీ పోనీక, ఏ గడప తొక్కనీయక, బామ్మ పుణ్యమాని పెరిగాడు. ఆడపిల్లలంటే పదేళ్ళకే చెమటలు పట్టేవి. వాళ్ళు మనుషులు కాకుండా మరెవరో అయినట్లు.

ఇక కాలేజ్‌లో రోజూ గండమే. ఎవ్వరైనా పలక

రించినా తల తిప్పి చూసేవాడు కాదు. ఓసారి ఒక గడుసు పిల్ల ప్రేమలేఖ రాసింది. ''నీ సిన్సియారిటీ నాకు బాగా నచ్చింది. నీలాంటోడికి భార్యగా ఉంటే బాగుంటుందని మా అమ్మమ్మ చెప్పింది. నువ్వు ఓ.కె. అంటే నా లవర్‌కి టాటా చెప్పేసి వస్తా'' అని.

ఇది చదివి కామరాజు కాలేజీ మానేయాలనుకున్నాడు. కానీ జీవితమన్నాక ఇలాంటి అవమానాలు, ఆటుపోట్లు అతి సహజమని భావించి ముందుకు సాగిపోయాడు.

కట్న కానుకలు, ముడుపులు గట్రా బేరసారాలు చేస్తున్నారు. సంతకి గేదెని తీసుకొచ్చి బేరం పెడుతుంటే ఆ గేదె ఏం పట్టించుకోకుండా నెమరు వేసుకుంటున్నట్లు కాకుండా కామరాజు చాలా ఫీలయ్యాడు. 'నా ప్రమేయం లేకుండా నా 'రేటు' ఫిక్సు చేస్తున్నార'ని.

''చెప్పడానికి అమ్మాయి తడబడుతోంది. కాస్త టైమిస్తే ఉత్తరంముక్క రాస్తుందట'' అంటూ కా.రా.కు కాబోయే అత్తగారు వచ్చి చెప్పింది.

'హమ్మా! అబ్బాయి తరుపున వాళ్ళు కదా! ఈ డైలాగ్ చెప్పాల్సింది' అనుకుంటూ బామ్మ వైపు చూశాడు.

బామ్మ స్థిరచిత్తంతో దృఢ సంకల్పంతోనే వచ్చింది కదా..''ఉత్తరమెందుకే తల్లీ! ఉండడానికి మాకేం మొహమాటం లేదు. రేపుదయం వరకు ఉంటాం. వీలవుతుందా మనవరాలా?'' అంది సిగ్గు అస్సలు లేనట్లు.

కామరాజుకైతే తల తీసేసినట్లు, కాళ్ళు మెలేసినట్లు ఎంత ఇదైందనుకున్నారు?

'ఛీ! ఎదవ బ్రతుకు. ఏ జన్మలో ఏ పాపం చేశానో..? ఈవిడగార్కి మనవడినై పుట్టాను. ఈ జీవితానికిక సంతోషం లేదా?' అని మనసులో అనుకుంటుండగా పిల్ల నాన్నగారు వచ్చి ''మీరు బయలుదేరండి. అమ్మాయి ఉత్తరం రాస్తానందిగా'' అని మరో దెబ్బ వేశాడు.

బామ్మ ఆయన్ను ఇంకేదో అడగబోతుండగా కా.రా. గట్టిగా గిచ్చాడు. అర్థం చేసుకుంది కాబట్టి కిక్కురుమనకుండా వచ్చేసింది. అదే అపార్థం చేసుకుంటేనా తన ఎక్స్‌రే మొత్తం వాళ్ళకి చెప్పేసేది.

కామరాజు అమ్మానాన్నలు డమ్మీలై బామ్మను అనుసరించారు భక్తిగా.

★ ★ ★

''వారమైనా ఉత్తరం రాలేదు. వీడికీ జన్మకి పెళ్ళయ్యే యోగముందో లేదో'' అలా బంగారమ్మ అనుకోవడం లెక్కపెడితే సెంచరీ దాటేదే.

కళ్ళు రెప్పవేయడం మరిచి పగలే వత్తులు వేసుకుని చూస్తున్నారు ఇల్లు ఇల్లంతా పోస్ట్‌మేన్ కోసం.

''పోస్ట్'' అని గావుకేక పెట్టినట్లు అరిచినా ఆ పిలుపు లతామంగేష్కర్ పాటలా తన్మయత్వంగా వింటున్నారు. కట్టలు తెగిన కోపంతో ఉత్తరాన్ని ముద్దచేసి ఇంట్లోకి గిరాటేశాడు పోస్టుమాన్. అది నేరుగా వెళ్ళి కా.రా. ముఖాన్ని ముద్దాడింది. భయంతో మాట మరిచిపోయాడు. కాసేపటికి తేరుకుని ఉత్తరాన్ని వణుకుతున్న చేతులతో విప్పి చదువుతున్నాడు.

''రాజు-

మనిషి పుట్టినప్పుడు అమ్మ ఒడిలో ఆడుకుంటాడు. కొన్నాళ్ళకి నాన్న వేలు పట్టుకుని నడుస్తాడు. అలాగని జీవితాంతం అలాగే ఉంటానంటే ఎలా? వయసు, దాంతోపాటు శరీరం మారుతున్నప్పుడు ప్రవర్తనలో ఎందుకు మార్పు రాలేదు? ఇది మిమ్మల్ని ఉద్దేశించే!

మీ గూర్చి నా ఫ్రెండు చెప్పింది. పాతిక సంవత్సరాలు నెత్తిన పెట్టుకుని ఒక్క సొంత అభిప్రాయం లేకుండా, స్వయం నిర్ణయం తీసుకోకుండా ఎలా పెరిగారు? సరే! పెంచేవాళ్ళకు తెలీదు. మీరన్నా లోకంలో వస్తున్న మార్పులు పరిశీలించవచ్చుకదా! ఇంకా పాత తరం మాటలు ఎందుకు? మీకు తెల్సే ఉంటుంది..పూర్వం నాణేలు, అణాలు ఉండేవట. మరిపుడవి ఎందుకు చెల్లడం లేదు? అవి డబ్బే కదా! ఒకప్పుడున్న ప్రతీ ఆచారం ఆనవాయితీ ఇప్పుడు అవసరం లేదు. కాలం మారింది. మారుతూనే ఉంటుంది. మనం మారకుండా ఉంటే ఎపుడో ఒకసారి ముంచేస్తుంది.

నిజం చెప్పాలంటే మీ అమాయకత్వం నాకు నచ్చింది. పాపం వచ్చే పిల్ల గడుసుదైతే [illegible] కొన కొంగుకు ముడేసుకుని తొక్కుడు బిళ్ళ ఆడుకుంటుంది.

'ఏంటి? ఇలా బాదుతోంది. నచ్చానా లేదా చెప్పకుండా దుమ్ము దుమారం లేపుతోంది' అని ప్రక్కనే నిలబడి చూస్తున్న ఫ్యామిలీ మెంబర్స్‌ని పరిశీలనగా చూశాడు. 'వాళ్ళు చూసేది నన్నే' అని నిశ్చయించుకున్నాక ఫేస్ ఫీలింగ్స్ మార్చి మళ్ళీ ఉత్తరంలో తల దూర్చాడు.

...మీ బామ్మకు గౌరవ మీయద్దనిగానీ, మాట వినొద్దనిగానీ చెప్పడం లేదు. చెప్పాగా ఎవరి కాలంలో వాళ్ళుండాలి. మనిషికి సొంత అభిప్రాయాలు అవసరం. రేపు మీకు భార్యగా వచ్చాక ఇతరులపైనే ఆధారపడితే ఏ ఆడది సహించదు. సొంతంగా తింటున్నప్పుడు, సొంతంగా ఎందుకు ఆలోచించకూడదు?

ఎవరెన్ని చెప్పినా వినాలి. కానీ నిర్ణయం మాత్రం మనమే తీసుకోవాలి. బాధపడుతున్నారా? మార్పు వచ్చేటప్పుడు బాధ సహజం. మీరు మారారని నిరూపించుకోవడానికి ఒక్కరే మీరొక్కరే నేనుండే లేడీస్ హాస్టల్‌కి రండి. అట్నుంచి ఇద్దరం కల్సి సినిమాకెళ్దాం. రాత్రి డిన్నర్ మా ఇంట్లోనే!


ఇంత చెప్పినా ఇంకా అర్థం కాలేదా? మీరు నాకు నచ్చారు. సరేనా! మరచిపోకుండా ఈ ఉత్తరం మీ ఇంట్లో వాళ్ళందరిచేతా చదివించండి. మార్పు మీలోనే కాదు వారిలోనూ రావాలి కదా!

మరిక ఉండనా-
మీ కాబోయే శ్రీమతి
శశిరేఖ.''

మొత్తం చదివాడు. కళ్ళు నిజంగానే తెరుచుకున్నట్లు వింతగా చూస్తున్నాడు.

''ఎవరు రాశార్రా! ఆ పిల్లేనా ఏదీ ఇటివ్వు'' అంటూ బామ్మ తీసుకుని తన కొడుక్కిచ్చింది చదవమని.

కొంపలో డైనమెట్లో, డిటోనేటర్లో పేలుతాయనుకుని చెవులు మూసుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు కామరాజు.




దగ్గరికొస్తున్న బామ్మ వైపే భయంగా చూస్తూ నిలబడ్డాడు. ''కాముడూ..ఇన్నాళ్ళూ నా చాదస్తంతో మీకు చాలా బాధ కలిగించానురా! ఈ పిల్ల చాలా తెలివైంది. అన్నీ నిజాలే రాసిందిరా! నువ్వెంటనే వెళ్ళు. మనం మారామని ఆ పిల్లకి తెలియాలిగా'' అంది కామరాజు ముఖాన్ని నిమురుతూ.

కామరాజు నోరు తెరిచాడు. ఏదో అరవబోయేంతలో శశిరేఖకు వినబడుతుందేమోనని ఆగి చిన్న విజిల్ వేస్తూ గడపదాటాడు స్టైల్‌గా.

★